Namasthe Telangana Dt 18/09/17.

# కేరాఫ్ మెట్రో పిల్లర్



బేగంపేటలోని మెట్రోరైలు భవన్‌లో మెట్రో పిల్లర్లకు నంబర్ల కేటాయింపుపై ఇంజనీర్లతో చర్చిస్తున్న ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

- స్తంభాలకు నంబర్లు వేయాలని నిర్ణయం
- కారిడార్-1కు ఏ సిరీస్, 2కు బీ, 3కు సీ
- భవిష్యత్‌లో సూచికలుగా మెట్రో పిల్లర్లు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఏ-1, బీ-1, సీ-1.. ఇలా 2,748 పిల్లర్ల నంబర్లు. ఇవేంటనుకుంటున్నారా?. మెట్రోరైలు పిల్లర్లకు వేసే నంబర్లు. ఇవే నగర ప్రజలకు భవిష్యత్‌లో కేరాఫ్ అడ్రస్‌గా మారనున్నాయి. నవంబర్‌లో మియాపూర్-నాగోల్ మధ్య మెట్రోరైలును ప్రారంభించనున్న నేపథ్యంలో మెట్రోరైలు అధికారులు పిల్లర్లకు నంబర్లు వేయాలని నిర్ణయించారు. వీటిపై ఆదివారం మెట్రోరైలు ఇంజినీర్లతో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి బేగంపేటలోని మెట్రోరైలు భవన్‌లో చర్చించి తుది నిర్ణయానికి వచ్చారు. కారిడార్-1 (మియాపూర్-ఎల్బీనగర్)కు ఏ సిరీస్, కారిడార్-2 (జేబీఎస్-ఫలక్‌నుమా)కు బీ, కారిడార్-3(నాగోల్ నుంచి రాయదుర్గం)కు సీ అక్షరాలను కేటాయించారు. కారిడార్-1 మియాపూర్ వద్ద మొదటి పిల్లర్‌కు ఏ-1తో ప్రారంభమై అమీర్‌పేట్ స్టేషన్ సమీపంలో ఏ-450, ఎంజీబీఎస్ స్టేషన్ వద్ద పిల్లర్‌కు ఏ-769, ఎల్బీనగర్‌లో చివరి పిల్లర్‌కు ఏ-1108 నంబర్‌ను వేయనున్నారు. కారిడార్-2లో జేబీఎస్ వద్ద మొదటి పిల్లర్‌కు బీ-1.. ముషీరాబాద్ స్టేషన్ వద్ద పిల్లర్‌కు బీ-152, ఆర్టీసీ ఎక్స్‌రోడ్ స్టేషన్‌కు బీ-186, ఎంజీబీఎస్ స్టేషన్ వద్ద పిల్లర్‌కు బీ-856, ఫలక్‌నుమా డిపో వద్ద గల పిల్లర్‌కు బీ-588 వేస్తారు. కారిడార్-3లో నాగోల్‌లోని మొదటి పిల్లర్ సీ-1 నంబర్‌తో ప్రారంభమవుతుంది. మెట్టుగూడ వద్ద ఉండే పిల్లర్‌కు సీ-288, బేగంపేట స్టేషన్ వద్ద పిల్లర్‌కు సీ-588, అమీర్‌పేట్ వద్ద ఉన్న పిల్లర్‌కు సీ-628, హైటెక్‌సిటీ స్టేషన్ వద్ద సీ-1001, రాయదుర్గం వద్ద పిల్లర్‌కు సీ-1052 నంబర్లను కేటాయించనున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా స్ట్రెచ్‌ను మినహాయిస్తే 2,581 పిల్లర్లకు నంబర్లు వేయనున్నారు. భవిష్యత్‌లో చేపట్టే కారిడార్లకు డీ,ఈ, ఎఫ్ మొదలైన సిరీస్‌లలో నంబర్లు కేటాయిస్తారు.

**నాలుగు ద్వారాలు.. తెలుగు, ఇంగ్లిష్‌లో సైన్‌బోర్డులు**

ప్రతి స్టేషన్‌కు నాలు ద్వారాలను ఏర్పాటు చేస్తున్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో సైన్‌బోర్డులు ఏర్పా టు చేయనున్నారు. సమీప కాలనీలు, ముఖ్య ప్రాంతాల్లో రూట్‌మ్యాపులు ఏర్పాటు చేస్తున్నారు. టాయిలెట్స్, బస్‌బేలు, ఆటో, ఈ-వెహికల్స్ బే, పార్కింగ్ లొకేషన్స్, ఎంట్రీ/ఎగ్జిట్ ఇండికేటర్స్ వంటి సూచికలను ఏర్పాటు చేస్తారు. ఈ సమావేశంలో ఎల్ అండ్ టీ, ఎంఆర్‌హెచ్‌ఎల్ ఎండీ శివానంద్ నింబార్గి, రైల్ సిస్టమ్స్ సీవోవో అనిల్‌కుమార్ సాయిని, మేనేజర్(సీఆర్‌ఎం) రాజీవ్ లయర్, హెచ్‌ఎంఆర్‌ఎల్ చీఫ్ ఇంజినీర్ డీవీఎస్ రాజు, ఎస్‌ఈలు సీ వినోద్‌కుమార్, ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, టీఎస్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఆకర్షణగా అమీర్‌పేట్ స్టేషన్

రెండు లక్షలకు పైగా చదరపు గజాల విస్తీర్ణంలో.. దేశంలోనే అతిపెద్ద మెట్రోస్టేషన్‌గా రూపుదిద్దుకుంటున్న అమీర్‌పేట్ ఇంటర్‌చేంజ్ స్టేషన్‌లో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. కింది భాగంలో కారిడార్-3కి సంబంధించిన రైళ్లు, దానికి 12 ఫీట్ల ఎత్తులో కారిడార్-1 నుంచి వచ్చే రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. రెండు కారిడార్లను వేర్వేరుగా మూడు అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. మొదటి అంతస్తులో కంట్రోల్ రూమ్‌లు, ఆటోమెటిక్ ఫేర్ కలెక్షన్ గేట్లు, టికెటింగ్ రూమ్స్ ఉంటాయి. స్టేషన్‌కు రెండు వైపులా 16 లిఫ్టులు, 12 ఎస్కలేటర్లు, 12 మెట్ల మార్గాలు నిర్మిస్తున్నారు. స్టేషన్ పొడవు 476 ఫీట్లు కాగా, వెడల్పు 148 ఫీట్లు. భూమి నుంచి కారిడార్-3 (మొదటి అంతస్తు) ఎత్తు 80 ఫీట్లు, కారిడార్-1 ప్లాట్‌ఫాం ఎత్తు 92 ఫీట్లు, భూమి మీది నుంచి పైకప్పు వరకు ఎత్తు 112 ఫీట్లుగా నిర్మిస్తున్నారు. స్టేషన్ ఎత్తు, పొడవు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పైకప్పును ఆధునిక విమానాశ్రయాలు నిర్మించే ఏజెన్సీ 'త్రిచి' సాయంతో నిర్మిస్తున్నారు. రోజుకు 30 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకేసారి 6 వేల మంది స్టేషన్లో ఉండేలా ఏర్పాట్లు ఉంటాయి. దీపావళిలోగా పనులు పూర్తి చేసేందుకు 800 మంది రేయింబవళ్లు పనిచేస్తున్నారు.

**సలహాలు స్వీకరిస్తాం: ఎండీ ఎన్వీఎస్ రెడ్డి**

సౌకర్యాల ఏర్పాటులో ప్రజల సలహాలను స్వీకరిస్తామని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. సలహాలను వెబ్‌సైట్ info-hmrl@telangana.gov.inకు పోస్ట్‌చేయాలని సూచించారు. పిల్లర్లకు నంబర్లు వేయడం ద్వారా విదేశీ టూరిస్టులకు కూడా సౌలభ్యంగా ఉంటుందన్నారు. నగరాన్ని ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దాలన్న ఐటీ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ ఆకాంక్షలకు అనుగుణంగా మెట్రో రైలు నిర్మాణంలో చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.